## క్లుప్తంగా

### పత్ర పుష్పాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

**సీతానగరం:** మండల కేంద్రంలోని సువర్ణముఖీ నదీ తీరాన వెలసిన లక్ష్మీనృసింహస్వామి పత్ర పుష్పాలతో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. స్వామి వారికి ప్రీతికరమైన గురువారం కావడం వలన భక్తులకున్న నమ్మకంతో వారంతా పూజా సామగ్రితో పాల్గొని ముడుపుల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో స్వామి వారికి అర్చకులతో ప్రత్యేక అలంకరణ చేసారు.

### లెప్రసీపై అవగాహన అవసరం



లెప్రసీ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

**పార్వతీపురం టౌన్:** లెప్రసీ వ్యాధిపై అవగాహన తప్పనిసరని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు అన్నారు. ఈ మేరకు గురువారం లెప్రసీ నివారణ కార్యక్రమంలో భాగంగా బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద, నర్సిపురం బీసీ హాస్టల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెప్రసీ లక్షణాలు ఉంటే తక్షణమే సమీప వైద్య కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భాగ్యజ్యోతి, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎస్ఎంకె.తిరుమల ప్రసాద్, డాక్టర్ పి.శ్రీకాంత్, సూపర్‌వైజర్, జయగౌడ్ పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

### మొక్కజొన్న సాగుపై ఆసక్తి



ములగలో సాగు చేస్తున్న మొక్కజొన్న

**పార్వతీపురం:** మొక్కజొన్న పంటను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. మొక్కజొన్నను పశువుల దాణాగా, కోళ్లమేతగా, పరిశ్రమలలో ముడిసరుకుగా వినియోగించడంతో పాటు మార్కెటింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకపోవడంతో సాగు చేసేందుకు ముందుకు వస్తున్నారు. మండలంలోని ములగ, చినబొండపల్లి, సంగంవలస, తాళ్లబురిడి తదితర గ్రామాలలో సుమారు 80 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. మొక్కజొన్న పంటను రబీలో నీరు నిలవని సారవంతమైన నేలలోను, మధ్యరకం నేలలోను డిసెంబర్ చివర నెల నుంచి జనవరి నెల వరకు విత్తుకోవచ్చు. ఎకరాకు 7 నుంచి 8 కిలోల విత్తనాలను వాడాలి. కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్‌తో విత్తనశుద్ధి చేయాలి. మొక్కజొన్న విత్తనాలను వరుసల మధ్య 2 1/2అడుగులు, మొక్కల మధ్య 8 అంగుళాల దూరంలో విత్తుకోవాలి. విత్తనాలు విత్తే ముందు ఆఖరి దుక్కిలో 50 కిలోల డీఏపీ, 40 కిలోల యూరియా, 35 కిలోల పొటాష్‌ను వేయాలి. విత్తిన నెల రోజులకు 35 కిలోల యూరియా, 60 రోజులకు 35 కిలోల యూరియాను మొక్కకు దగ్గరలో వేయాలి. పంటలో జింకు లోపం ఎప్పుడైనా కనిపిస్తే లీటర్ నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేయాలి. సరైన యాజమాన్య పద్ధతులలో పంటలు పండిస్తే వ్యయం తక్కువ కావడంతో పాటు దిగుబడులు అధికంగా వచ్చేందుకు అవకాశం ఉంటుందని వ్యవసాయ సిబ్బంది పేర్కొంటున్నారు.

# మచ్చే కదా అని వదిలేస్తే ముప్పే..

- ఇంటింటా కుష్ఠు నిర్ధారణ సర్వే
- మచ్చలను పరిశీలిస్తున్న వైద్యులు

**బలిజిపేట:** కుష్ఠు వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా వైద్య శాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి సర్వే చేసి మచ్చలు ఉంటే వాటిని నిర్ధారణ చేపడుతున్నారు. అనుమానిత మచ్చలు, పొడలు శరీరంపై ఉంటే నిర్భయంగా ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందికి తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు. ఈ సర్వే ఫిబ్రవరి 2వ తేదీ వరకు నిర్వహిస్తారు.

**● వివరాలన్నీ ఆరా తీస్తూ..**

శరీరంపై మచ్చలు, అధిక మోతాదులో పొడలు ఉంటే సిబ్బంది వైద్యాధికారుల దృష్టికి తీసుకెళ్తారు. వైద్యాధికారులు అనుమానిత లక్షణాలున్న వ్యక్తిని పరిశీలించి కుష్ఠు వ్యాధి అవునో.. కాదో... నిర్ధారణ



ఇంటింటి సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

చేస్తారు. ఒక వేళ కుష్ఠుగా తేలితే సంబంధిత వ్యక్తి పేరును రిజిస్టర్ చేసుకొని చికిత్స ప్రారంభిస్తారు. కుష్ఠువ్యాధి మైక్రో బాక్టీరియా లెప్రే వల్ల వస్తుంది. ఈ వ్యాధి పూర్వజన్మ శాపం వల్లనో, పాపం వల్లనో, వంశ పారంపర్యంగానూ సోకదు. రోగి తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. ప్రతి నాలుగు నెలలకోసారి ఇంటింటి సర్వే చేయడంతో పాటు త్వరితగతిన వ్యాధిగ్రస్తులను కనుగొని చికిత్స ఇవ్వడం ద్వారా అంగ వైకల్యం రాకుండా కాపాడవచ్చు. వ్యాధి కారక బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించిన ఆరు నెలల నుంచి ఐదేళ్ల లోపల వ్యాధి లక్షణాలు బయట పడతాయని వైద్యాధికారులు చెబుతున్నారు.

**● ఎండీటీ మందులతో వ్యాధి నయం**

బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ) ద్వారా కుష్ఠు వ్యాధి పూర్తిగా నయమవుతుంది. ప్రారంభ దశలో గుర్తించి సక్రమంగా చికిత్స చేయించుకుంటే వ్యాధితో పాటు అంగ వైకల్యం రాకుండా నివారించవచ్చు. ఆరు నెలల నుంచి 12 నెలల పాటు ఎండీటీ మందులతో చికిత్స తీసుకుంటే కుష్ఠు పూర్తిగా నయమవుతుంది.

### కుష్ఠు వ్యాధి లక్షణాలు ఇవే..

- చర్మంపై పాలిపోయిన రాగివర్ణంతో కూడిన స్పర్శలేని మచ్చలు ఏర్పడడం.
- కుష్ఠు వ్యాధి సంబంధిత మచ్చలపై చెమట పట్టకపోవడం.
- కను బొమ్మలు లేదా వెంట్రుకలు రాలిపోవడం.
- ముఖంపై చర్మంపై నూనె రాసినట్టు నిగనిగలాడుతుంది.
- కాళ్లు, చేతులపై స్పర్శ జ్ఞానం లోపించడం.
- ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం.
- కాళ్లు చేతులు తిమ్మిర్లు, అరికాళ్లు, చేతులకు స్పర్శ లోపించడం.
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం.
- వేళ్లు వంకర్లు తిరగడం.



మచ్చలను చూపిస్తున్న వ్యక్తి

### నిర్లక్ష్యం చేయొద్దు..



శరీరంపై ఎటువంటి మచ్చలు ఉన్నా వాటిని వెంటనే వైద్యులచే పరీక్షలు చేయించుకోవాలి. నిర్లక్ష్యం వహిస్తే సమస్యలు వస్తాయి. సర్వేలో కాని, ఆ తరువాత కాని వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. వాటిని దాచుకుని వ్యాధిని ముదరపెట్టుకోవద్దు.

– క్రాంతి కిరణ్మయి, వైద్యాధికారిణి, బలిజిపేట పీహెచ్‌సీ

## వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

**పార్వతీపురం టౌన్:** వైఎస్సార్‌సీపీ పార్వతీపురం నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేసారు.

| విభాగం | అధ్యక్షులు | విభాగం | అధ్యక్షులు |
|---|---|---|---|
| యూత్ వింగ్ | కోరాడ శేఖర్ | గ్రీవెన్స్ సెల్ | బలగ నాగేశ్వరరావు |
| మహిళా విభాగం | దాసరి నాగరత్నం | వాణిజ్య విభాగం | బోగేర్ల వెంకటరాజు |
| రైతు విభాగం | రామతోట వెంకట ప్రసాద సారథి | వీవర్స్ వింగ్ | పిచ్చుక శేషు |
| బీసీ సెల్ | గొర్లి మాధవరావు | వైఎస్సార్‌టీయూసీ | తమ్మిరెడ్డి సతీష్ |
| ఎస్సీ సెల్ | కోల సుధాకరరావు | అంగన్వాడీ విభాగం | సమంతుల శ్రీవాణి |
| ఎస్టీ సెల్ | చీమల గంగరాజు | లీగల్ సెల్ | గుర్ల కృష్ణ |
| మైనార్టీ సెల్ | ఎస్‌కె. మహ్మద్ జలాల్ | కల్చరల్ వింగ్ | యాద్రాపు వెంకట నాయుడు |
| క్రిస్టియన్ మైనార్టీ సెల్ | నిమ్మకాయల సుధీర్‌చంద్ర | సోషల్ మీడియా వింగ్ | సిల్లా వెంకటరమణ |
| స్టూడెంట్ వింగ్ | అలజంగి యజ్ఞేష్ | ఐటీ వింగ్ | ద్వారపూడి గణేష్ |
| పంచాయతీ రాజ్ వింగ్ | బంకురి రవికుమార్ | దివ్యాంగుల విభాగం | బత్తుల వెంకటేశ్వరులు |
| మున్సిపల్ వింగ్ | గొల్లు వెంకటరావు | డాక్టర్స్ వింగ్ | బడే సత్యనారాయణ |
| ఆర్‌టీఐ వింగ్ | సతివాడ రాము | ఇన్‌టెలెక్చ్యువల్స్ ఫోర్స్ | నడింపల్లి హరికృష్ణ |
| వలంటీర్స్ వింగ్ | సిల్లా అనిల్ | బూత్ కమిటీ | గంటేడ శ్రీరాములనాయుడు |
| | | పబ్లిక్ వింగ్ | సేనాపతి తిరుపతిరావు |

### ● కుష్ఠుపై అవగాహన



స్పర్శ కార్యక్రమంతో కుష్ఠు వ్యాధిపై అందరికీ అవగాహన కల్పించాలని బలిజిపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి క్రాంతి కిరణ్మయి అన్నారు. పెదపెంకిలో స్పర్శ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 13 వరకు గ్రామాల్లో నిర్వహిస్తామన్నారు. వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకే విధానం తదితర విషయాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. కుష్ఠు వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేసారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు. – బలిజిపేట

# చేప పిల్లల పెంపకానికి చర్యలు

**మక్కువ:** ఐటీడీఏ ఆధ్వర్యంలో చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి చర్యలు చేపట్టినట్లు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి వై.ఆశాదేవి తెలిపారు. మక్కువ మత్స్యకార సహకార సంఘం పరిధిలోని కవిరిపల్లి, సరాయివలస, కొండరేజేరు, తూరుమామిడి గ్రామాలలో 22 చెరువుల్లో 60,070 చేప పిల్లలను గురువారం విడిచిపెట్టారు. అలాగే గిరిజన మత్స్యకార సహకార సంఘం పరిధిలోని కొయ్యన్నపేట గ్రామంలో 14 చెరువులలో 27,510, వెంకటభైరిపురం గ్రామంలోని ఐదు చెరువులలో 14,830 కట్ల, రోయ, మగల రకాల చేప పిల్లలను విడిచిపెట్టారు. శత శాతం రాయితీతో మత్స్యకారుల అభివృద్ధికి చెరువుల్లో చేప పిల్లలను విడిచిపెట్టినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో మక్కువ మత్స్యకార సంఘం అధ్యక్షుడు టి.సత్యనారాయణ, గ్రామ మత్స్య సహాయకులు ఎస్.గౌరీశ్వరరావు, జి.సింహాచలం, పంచాయతీ సెక్రెటరీ సీత తదితరులు పాల్గొన్నారు.



కవిరిపల్లి చెరువులో చేప పిల్లలు విడిచి పెడుతున్న జిల్లా మత్స్య శాఖ అభివృద్ధి అధికారిణి ఆశాదేవి

### సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

**సాలూరు:** రీసర్వే, రెవెన్యూ సదస్సులలో రైతుల నుంచి వచ్చిన సమస్యలు త్వరితంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేయాలని తెలిపారు. మండలాల వారీగా వచ్చిన ఫిర్యాదులు, వాటి ప్రగతి తదితర అంశాలపై ఆరా తీసారు. విధి నిర్వహణలో అలసత్వం వహించవద్దని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్‌లు, సర్వేయర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చురుగ్గా పారిశుద్ధ్య పనులు

**సీతానగరం:** మండలంలో పెద్ద గ్రామమైన బూర్జలో సర్పంచ్ గుజ్జల దాసు ఆధ్వర్యంలో జరుగుతున్న సామాజికపరమైన అభివృద్ధి పనులను ఇంజనీరింగ్ సహాయకులు ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గ్రామంలోని మూడు వీధుల్లో పారిశుద్ధ్య పనులు, పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామ శివారులో ఉన్న స్వర్గ ధామానికి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజల నుంచి వినతులు రావడంతో గ్రావెల్ రోడ్డు వేయడం జరిగిందన్నారు. అలాగే తంగుడు వీధి నిర్మాణం చేసినప్పటి నుంచి అభివృద్ధికి నోచుకోకపోవడంతో గ్రావెల్ రోడ్డుతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. శివాలయానికి సీసీ రోడ్డు వేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మూడడ్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**బలిజిపేట:** ప్రకృతి వ్యవసాయం వలన ఆరోగ్యకరమైన పంట లభిస్తుందని, పెట్టుబడి తగ్గి మంచి దిగుబడి వస్తుందని పార్వతీపురం డివిజన్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఎస్ఎఫ్ఏ తిరుపతిరావు అన్నారు. వెంగళరాయపురంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రకాల పంటలకు అనుకూలమైన విధానం ప్రకృతి వ్యవసాయమన్నారు. దీనిద్వారా తక్కువ పెట్టుబడితో నివారణ మందులను తయారుచేసుకోవచ్చన్నారు. రసాయన ఎరువులు లేకుండా పంటను పండించవచ్చని తెలిపారు. మొక్కజొన్న పంటకు ప్రస్తుతం కత్తెర పురుగు సోకుతుందని దాని నివారణకు అవసరమైన అగ్ని అస్త్రం ద్రావణం తయారుచేసి స్ప్రే చేయడం వలన నివారణ సాధ్యమవుతుందన్నారు. దీనిని తయారు చేయడంపై వారికి అవగాహన కల్పించారు. మొక్క స్టేజిని బట్టి ఆరు నుంచి ఎనిమిది లీటర్లు 200లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంటీ శ్రీరాములు, ఎంసీఆర్‌పీ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



వెంగళరాయపురంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఎఫ్ఏ

### హెల్మెట్‌ధారణ తప్పనిసరి



వాహన తనిఖీలు చేపడుతున్న ఏఎస్ఐ

**మక్కువ:** ప్రతీ ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పక వినియోగించాలని ఏఎస్ఐ ఎం.శ్రీనివాసరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో గురువారం పోలీసులు వాహన తనిఖీలను చేపట్టారు. వాహన పత్రాలను పరిశీలించారు. ప్రతి వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

**సాలూరులో..**

**సాలూరు:** వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలను నడపరాదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలో కొటియా ప్రాంతంలో నివసించే ప్రజలకు, జీపు డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఏఎంవీఐ కాశీరాం నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

**పార్వతీపురంలో..**

**పార్వతీపురం టౌన్:** వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఏఎంవీఐ సత్యనారాయణ సూచించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా జిల్లాలో జరుగుతున్న ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం పట్టణ ప్రధాన రహదారిపై నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనచోదకులు పాటించాల్సిన నియమ నిబంధనలు వివరించారు. వాహన పత్రాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

# పశు సంపదను కాపాడుకుందాం..

**పార్వతీపురం టౌన్:** మూగజీవాలైన పశువులకు సీజన్ల వారీగా వచ్చే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారి భోగి చక్రధర్ అన్నారు. గురువారం ఎమ్మార్‌నగరం పంచాయతీలో గల పశువులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్రమత్తంగా ఉన్నప్పుడే వ్యాధులను గుర్తించగలమని పశుసంపదను మరింత పెంపొందించగలమన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పశువైద్య శిబిరాలు మండలంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాల్లో వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించి మందులను రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడిరైతులు పాల్గొన్నారు.

**బలిజిపేటలో..**

**బలిజిపేట:** మండలంలోని తుమరాడ, అంపావల్లి గ్రామాల్లో మండల పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు గురువారం నిర్వహించారు. అందులో భాగంగా 65పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు, చూడు పరీక్షలు, 68పశువులకు వైద్యం, మందులు పంపిణీ చేసారు. 188పశువులకు నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పార్వతీపురం టౌన్ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ భోగి చక్రధర్

**సీతానగరంలో..**

**సీతానగరం:** మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య వైద్య శిబిరాలలో పశువుల్లో గర్భకోశ వ్యాధుల నివారణకు ప్రాధాన్యతనిచ్చామని మండల పశువైద్యాధికారి డాక్టర్ ఎస్.రామారావు అన్నారు. మండలంలోని కాశీపేటలో గురువారం మండలంలోని అత్యధిక పాడి పశువులున్న కారణంగా పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ సీహెచ్ దీనకుమార్ పర్యవేక్షణలో పాడి పశువులకు గర్భకోశ వ్యాధుల నివారణకు వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి.వెంకటప్పలనాయుడు, మిల్క్ సొసైటీ చైర్మన్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్మన్ బి.ధనంజయరావు, టి.సత్యం మాస్టారు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### 'బాపూజీ ఆశయ సాధనకు పాటుపడదాం'



పార్వతీపురం టౌన్: గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు

**పార్వతీపురం టౌన్:** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆల్ ఇండియా రెడ్‌క్రాస్ మన్యం జిల్లా చైర్మన్ డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా హిందీ కళాశాల ఆవరణలో గాంధీజీ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

**బలిజిపేటలో...**

**బలిజిపేట:** బాపూజీ ఆశయ సాధనకు అందరం పాటుపడాలని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు అన్నారు. బాపూజీ వర్ధంతి సందర్భంగా గురువారం పెదపెంకిలో బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.అప్పలనాయుడు, పి.భాస్కర్, కె.సతీష్, ఎం.చిన్నంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.



బలిజిపేట: పెదపెంకిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, గ్రామ పెద్దలు

**సీతానగరంలో..**

**సీతానగరం:** సత్యం, అహింస మార్గాలే జాతిపిత ఆయుధాలని లచ్చయ్యపేట ఎంపీటీసీ అక్కపోలు సింహాచలం, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ అన్నారు. మండలంలోని లచ్చయ్యపేటలో గాంధీజీ వర్ధంతిని గురువారం ఘనంగా జరిపారు. జాతిపిత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# 1/70 చట్టం రద్దుకు ప్రయత్నిస్తే ఊరుకోం

- అయ్యన్నపాత్రుడు క్షమాపణ చెప్పాలి
- ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

**పార్వతీపురం టౌన్:** ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, రద్దుకు పూనుకుంటే సహించబోమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. ఏజెన్సీలో అభివృద్ధి జరగాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ జిల్లా ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం బెలగం కూడలి వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. 27వ తేదీన విశాఖపట్నంలో జాతీయ టూరిజం ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ చేసిన వ్యాఖ్యలు ఆదివాసీల్లో తీవ్ర ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయన్నారు. అల్లూరి సీతారామరాజు, ఏలూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని ఏజెన్సీ రాజ్యాంగంలో 5వ షెడ్యూలు కిందకు వస్తుందని తెలిపారు. దీన్ని ధిక్కరించే అధికారం ప్రభుత్వానికి కూడా లేదని పేర్కొన్నారు. ఇప్పటికే టూరిజం అభివృద్ధి పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని కోరారు. బినామీల పేరుతో గిరిజన భూముల్లో లాడ్జీలు పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గిరిజన ప్రాంతాలు 1/70ని సవరిస్తే మరింత వెనుకబడిపోతాయని, తక్షణం ఇలాంటి ఆలోచనలు విరమించుకోవాలన్నారు. 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో అలివేలు, ముత్యాలు, మంగమ్మ, జయరాజు, భాస్కర్, గిరి, వెంకటేష్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం పట్టణం బెలగాం కూడలి వద్ద రాస్తారోకో నిర్వహిస్తున్న గిరిజనులు